ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025



శివోహం



సంపంగిరామనగర పుష్కరిణిలో దీపోత్సవం

ఓం
నమఃశివాయ..
శంభో శంకరా అంటూ శివ నామస్మరణ మార్మోగింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

7లో



చింతామణి శనైశ్చర ఆలయంలో..



అలంకరణలో ఎన్ఎన్‌టీ లే అవుట్ నాగనాథేశ్వరస్వామి

జలవనరులకే ప్రాధాన్యం

- పెండింగ్ ప్రాజెక్టులకు అధిక నిధులు ఇవ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జలవనరుల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య ప్రధానిని కోరారు. సోమవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఢిల్లీలోని అధికారిక నివాసంలో కలిశారు. వివిధ అంశాలపై సీఎం సిద్దరామయ్య ప్రత్యేకమైన వినతులను ప్రధానమంత్రికి అందించారు. అందులో చెరకు రైతుల సమస్యను వివరించారు. ఇటీవల కర్ణాటకలో వేలాదిమంది చెరకు రైతులు ఆందోళన చేపట్టారని, కనీస మద్దతుధర కేజీ రూ.31గా నిర్ణయించారన్నారు. ఎఫ్ఆర్‌పీ కేంద్రప్రభుత్వమే నిర్ణయిస్తున్నందున రాష్ట్రంలో రైతులకు నష్టం కలుగుతోందన్నారు. కేజీకి రూ.35 డిమాండ్ చేస్తున్నారని, ఇటీవల నిరసనలు చేపట్టడంతో రైతుసంఘాల ముఖ్యులు, షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమన్వయంగా చర్చలు జరిపించామన్నారు. ప్రస్తుతం కేజీ రూ.31గా నిర్ధారించారని, అయితే టన్నుకు రూ.50 ప్రభుత్వం, మరో రూ.50 ఫ్యాక్టరీ యాజమాన్యం భరించేలా తీర్మానించామన్నారు. కేంద్రం జోక్యం చేసుకుని ఎఫ్ఆర్‌పీని సడలించాలని కోరారు.



రాష్ట్రంలో జలజీవన్ మిషన్‌కు అనుగుణంగా రాష్ట్రానికి రూ.13వేల కోట్లు విడుదల కావాల్సి ఉందని, నివేదికల రూపంలో వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3,804.41 కోట్ల రూపాయలు కేటాయించినా కేవలం రూ.570 కోట్లు మాత్రమే విడుదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే రూ.7045 కోట్ల రూపాయలు విడుదల చేయడం ద్వారా ప్రాజెక్టును విజయవంతం చేశామని, ఇంకా కేంద్రంనుంచి విడుదల కాలేదన్నారు. రాయచూరులో కొన్నేళ్లకాలంగా ఎయిమ్స్ సంస్థ స్థాపనకు ప్రతిపాదనలు పంపామని మంజూరు చేయాలని వివరించారు. రాష్ట్రంలో ప్రముఖమైన జలవనరుల ప్రాజెక్టుకు సంబంధించి అనుమతులు, నిధులు మంజూరు చేయాలని వివరించారు. కృష్ణ ప్రాజెక్టుకు 2023-24 బడ్జెట్‌లో ప్రకటించిన రూ.5,300 కోట్లు విడుదల చేయాలని కోరారు. కళసా-బండూరికి అనుమతులు స్తే హుబ్బళ్ళి-ధారవాడ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కానుందన్నారు. ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలతోపాటు మహారాష్ట్ర నుంచి వరద పోటెత్తడంతో తీరనినష్టం మిగిల్చిందన్నారు. 14,58 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని 19లక్షలమంది రైతులకు నష్టం కలిగిందన్నారు. రోడ్లు, ఇళ్లు, పాఠశాలలకు నష్టం కలిగిందని, ఎన్‌డీఆర్ఎఫ్ ద్వారా పరిహారం కోరుతూ రెండుసార్లు లేఖలు పంపామన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కొరత నియంత్రణకు 614.9 కోట్ల రూపాయలు, నష్టానికి సంబంధించి 1521.67 కోట్ల రూపాయలు కేటాయించాలని విన్నవించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సుమారు 40 నిమిషాలపాటు చర్చలు జరిపారు.

టెక్ సమ్మిట్‌లో ఏఐ ఆధారిత కియో పీసీ

- ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే



మీడియా సమావేశంలో మంత్రి ప్రియాంకఖర్గే తదితరులు

బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన బెంగళూరు టెక్ సమ్మిట్‌లో ఏఐ ఆధారిత మినీ కియో పీసీని పరిచయం చేస్తామని ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, బీటీ శాఖలతోపాటు కియోనెక్స్ సంయుక్త సహకారంతో అభివృద్ధి చేసిన కియో కంప్యూటర్‌ను తక్కువధరకే అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. బెంగళూరు టెక్ సమ్మిట్ మంగళవారం నుంచి మూడురోజులపాటు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి సోమవారం నగరంలో ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే మీడియాకు తెలిపారు. కొత్త కంప్యూటర్ కంప్యూటింగ్ సౌకర్యాలతో పాటు ఏఐ ఆధారితంగా రూపొందించామన్నారు. దేశంలో 10శాతం కంటే తక్కువ మంది కంప్యూటర్ కలిగి ఉన్నారని, కానీ కర్ణాటకలో 15శాతం ఉందన్నారు. స్మార్ట్‌ఫోన్‌ల వాడకం పెరిగినా విద్యాపరంగా కోడింగ్, ఆన్‌లైన్ క్లాస్‌లతోపాటు హైబ్రీడ్ నైపుణ్యతకు కంప్యూటర్లు అవసరం ఉందని పలు అధ్యయనాలు తెలిపాయన్నారు. సమగ్రమైన సాధనలు లేకుండా 60శాతంమంది విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు భాగస్వామ్యం కాలేకపోతున్నారన్నారు. డ్రాపౌట్లకు ఇది కూడా ఒక కారణమన్నారు. జ్ఞాన ఆధారిత (కే), మిత వ్యయం (ఈ), ముక్త కంప్యూటింగ్ (ఓపెన్ సోర్స్) ఈ సవాళ్లకు కర్ణాటక సమాధానం ఇవ్వనుందన్నారు. లైనక్స్ ఆధారిత ఆపరేటింగ్ సిస్టమ్ కల్గిన ఓపెన్ సోర్స్ ఆర్ఐఎస్‌సీ-వీ ప్రాసెసర్‌లతో రూపొందించిన కేఈఓ అందుబాటుధరలో సంపూర్ణ కంప్యూటింగ్ వినియోగ అనుభవం ఇవ్వనుందన్నారు. ఇది కర్ణాటకలోనే డిజిటల్ విభజనను తగ్గించనుందన్నారు. విలాసవంతమైనది కాదని తక్కువధరతోనే ఈ కంప్యూటర్‌ను విద్యార్థులు, చిన్నవ్యాపారులు డిజిటల్ ఆర్థికతలో పాల్గొనేవారికి సహకారం కానుందని ఖర్గే తెలిపారు.

అత్యాధునిక సదుపాయాలు

కియో లో 4జీ, వై-ఫై, ఈథర్‌నెట్, యూఎస్‌బీ-ఏ, యూఎస్‌బీ-సీ పోర్ట్‌లు, హెచ్‌డీఎంఐ, ఆడియోజాక్ సౌలభ్యం ఉంది. నైపుణ్యత, ప్రోగ్రామింగ్ ప్రొడక్టివిటీ పరికరాలతో (మిగతా 9వ పేజీలో)



పాలకులేరీ...?

- నిర్వీర్యం అవుతున్న స్థానిక సంస్థలు
- గడువు ముగిసినా ఎన్నికల ఊసేలేదు
- కోర్టు తీర్పు వచ్చినా కొలిక్కి రాని రిజర్వేషన్లు
- నాడు బీజేపీ.. నేడు కాంగ్రెస్.. అన్ని పార్టీలది అదే తీరు

స్థానిక సంస్థలు	ముగిసిన సంవత్సరం	సంఖ్య
గ్రేటర్ బెంగళూరు	2020	5
ఐదు పాలికెలు	2025	5
నగరసభ (సీఎంసీ)	2025 డిసెంబరు	47
పురసభలు (టీఎంసీ)	2025 డిసెంబరు	93
పట్టణ పంచాయతీ (టీపీ)	2025 డిసెంబరు	50
జిల్లా పంచాయతీ	2021	31
తాలూకా పంచాయతీ	2021	239
గ్రామ పంచాయతీ	2026 జనవరి	1116
	2026 ఫిబ్రవరి	4549
	2026 మార్చి	20



పురసభ కార్యాలయం

తరచూ కోర్టులకే..

పంచాయతీరాజ్ వ్యవస్థలో మూడంచెలలో కీలకమైన గ్రామపంచాయతీ ఎన్నికలు ఇదే దారి పడుతున్నాయి. మరో రెండు నెలల్లో రాష్ట్రంలోని 5వేల గ్రామపంచాయతీలకు పాలకవర్గం గడువు ముగుస్తోంది. వాటికి సకాలంలో ఎన్నికలు జరిపేందుకు కమిషన్ సిద్ధంగా ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ ఏడాది మే నెలలోనే ప్రభుత్వానికి లేఖ రాశారు. వార్డులవారీగా సభ్యుల సంఖ్య, రిజర్వేషన్లను ఖరారు చేయాలని కోరింది. కానీ ప్రభుత్వం ఏ విధంగానూ స్పందించలేదు. దీంతో ఎన్నికల కమిషన్ కోర్టును ఆశ్రయించింది. ఇటీవల న్యాయస్థానం రెండు వారాలలో వార్డుల రిజర్వేషన్‌లు ప్రకటించాలని ప్రభుత్వానికి సూచించింది. రిజర్వేషన్లు ప్రకటిస్తారా..? లేదా మరో కొత్త కారణంతో వాయిదా వేస్తారా..? అనేది ఎదురుచూడాల్సి ఉంది.



బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామస్వరాజ్యం కలలు సాకారం కావాలంటే స్థానిక సంస్థలు బలోపేతంగా ఉండాలని జాతిపిత మహాత్మాగాంధీ ఏడు దశాబ్దాలకుముందే ఆకాంక్షించారు. స్థానిక సంస్థలకు పాలకులు ఉంటే ప్రాంతాలవారీగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయి. అవసరానికి అనుగుణంగా అభివృద్ధి కూడా సాధ్యం కానుంది కేంద్రప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండానే కొన్ని ప్రత్యేకమైన గ్రాంట్లను గ్రామీణ ప్రాంతాలకు నేరుగా విడుదల చేస్తోంది. తద్వారా జాప్యం లేకుండా అత్యవసరమైన తాగునీరు, విద్యాసంస్థలు, పారిశుద్ధ్యంతోపాటు పలు విభాగాల్లో పెండింగ్ లేకుండా పనులు సాగుతున్నాయి. రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందితే చాలు అనే పరిస్థితిలో ఉన్నాయి. స్థానిక సంస్థల పట్ల ప్రత్యేకమైన చొరవ చూపడం లేదు. ఈ పరిణామం స్థానిక సంస్థల ఎన్నికలకు అడ్డుగోడగా మారుతోంది.

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించే విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏకంగా న్యాయపోరాటమే చేస్తోంది. గ్రామపంచాయతీ, తాలూకా పంచాయతీలకు ఎన్నికలు జరిపించాల్సిన కమిషన్ ఫైళ్లు పట్టుకుని కోర్టు చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడింది. మూడు విభాగాల పంచాయతీరాజ్ వ్యవస్థలో రెండు విభాగాలైన జిల్లా, తాలూకా పంచాయతీలకు ఐదేళ్లుగా ఎన్నికలు జరపలేదు. గత బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఓబీసీ రిజర్వేషన్ అవసరమని ఎన్నికలు వాయిదా వేస్తూ వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండున్నరేళ్ల అయినా ఎన్నికలు జరపాలనే ఆలోచనే చేయడం లేదు. జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేస్తూనే ఉన్నారు. బెంగళూరులో వార్డుల విభజన పూర్తి అయినా రిజర్వేషన్లు ఇంకా ఖరారు చేయలేదు. ఎప్పుడు ఎన్నికలు జరుపుతారనేది అంతుచిక్కని సమస్యగా ఉంది.

రిజర్వేషన్లపై తెగని పేచీ

సకాలంలో స్థానిక సంస్థలలో కీలకమైన గ్రామపంచాయతీలు, నగరసంస్థలకు ఎన్నికలు జరపాలనే రాజ్యాంగం 74 సవరణ ఆశయానికి వ్యతిరేకంగా ఉంది. ఏటా కేంద్రప్రభుత్వం నుంచి వస్తున్న కోట్లాది రూపాయల గ్రాంట్లు పాలకవర్గాలు లేక కోల్పోవాల్సి వస్తోంది. సుప్రీంకోర్టు సైతం స్థానిక సంస్థలు ఎన్నికలు సకాలంలో జరపడం రాజ్యాంగం విధి అని సూచించింది. ప్రజాప్రభుత్వ పునాదివేరు దుర్బలమైనట్లేనని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. దాదాపు అన్ని నగర పాలక సంస్థలదీ ఒకే విధానం. గతంలో బీబీఎంపీకి ఐదేళ్లకు ఎన్నికలు జరపలేదు. ప్రస్తుతం గ్రేటర్ బెంగళూరు ప్రాధికారగా మార్చి ఐదు పాలికెలుగా విభజించి వార్డులను ఖరారు చేశారు. కేవలం మిగిలింది. వార్డుల రిజర్వేషన్ మాత్రమే. అధికారంలో ఉండే పార్టీ ఏ విధంగా తమకు అనుకూలం చేసుకోవాలని ఆలోచనతో రిజర్వేషన్‌లు జరపకుండా వాయిదాలు వేస్తూ వస్తోంది. బెంగళూరు మాత్రమే కాదు, శివమొగ్గ, మైసూరు, తుమకూరు, దావణగెరె, మంగళూరు మహానగర పాలికెలకు ఎన్నికలు జరగలేదు. 2025 అక్టోబరు 18 నుంచి నవంబరు 6 మధ్యన ఐదేళ్ల అధికార వ్యవధి ముగిసిన వాటిలో 42 నగరసభలు, 53 పురసభలు, 23 పట్టన పంచాయతీలతో కలిపి 118 నగర, స్థానిక సంస్థలకు పాలనాధికారులను నియమించారు. ఈ ఏడాది ఆఖరుకు 195 నగర సంస్థలకు అధికార వ్యవధి ముగియనుంది. హైకోర్టులో పిటిషన్‌కు స్పందించిన ప్రభుత్వం ఐదు నెలల గడువు కోరింది. దీన్నిబట్టి మరికొన్ని నెలలు ఎన్నికల జోలికి వెళ్లే అవకాశాలు లేవు. స్థానిక సంస్థలలో పాలనాధికారులదే దర్బార్‌గా మారిపోయింది.

బీబీఎంపీలోనూ నిత్యం సమస్యలే..



రాష్ట్రంలోనే అతిపెద్దది, రాష్ట్ర రాజధాని కేంద్రం బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కు పాలకులు లేకుండా ఐదేళ్ల ముగిసింది. అత్యధిక జనాభా కలిగి ప్రాంతాలవారీగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రజాప్రతినిధులు కనిపించడమే కరువైంది. 198మంది కార్పొరేటర్లు స్థానికంగా అందుబాటులో ఉండి సమస్యలకు దిక్సూచిగా వ్యవహరించేవారు. ఎప్పటికప్పుడు పనులు సాగేవి. ప్రస్తుతం 28మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ఆరుగురు మంత్రులు ఉన్నారు. మంత్రులను కలవడం సాధ్యమయ్యే పరిస్థితి కాదు. నలుగురు ఎంపీలు ఉన్నా అందులో ఒకరు శోభా కరంద్లాజె కేంద్రమంత్రిగా కొనసాగుతున్నందున దేశమంతటా ఆమె పర్యటిస్తుంటారు. ఇక మరో ఎంపీ తేజస్వి సూర్య బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు ప్రజలకు అందుబాటులో ఉండేది అంత సులువేమీ కాదు. మరో ఇద్దరు ఎంపీల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది.

రెండో పంటకు నీరివ్వాల్సిందే

- రైతు సంఘం నాయకుల డిమాండ్
- టీబీబోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన
- బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల నుంచి తరలివచ్చిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి

బళ్లారి, నవబంరు 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఆయకట్టు భూములకు రెండో పంటకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్నాటక రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం తుంగభద్ర డ్యాం వద్ద ఆందోళన చేపట్టారు. రైతుల సంఘం నాయకులు మాధవరెడ్డి, చాగనూరు మల్లికార్జునరెడ్డి. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం నాయకులు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లా నుంచి రైతులు ఉదయమే డ్యాం వద్దకు చేరుకున్నారు. డ్యాంలో నీరున్నా నీరు వదలడం లేదని, నీరు వదలకపోతే బెంగళూరు వరకూ రైతులు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, మల్లికార్జున రెడ్డి మాట్లాడారు. తుంగభద్ర డ్యాంకు క్రస్ట్ గేట్లు ఎప్పుడు అమర్చేది. నీరు ఎప్పుడు బంద్ చేసేది అన్న విషయాల పై రైతులకు స్పష్టత ఇవ్వాలన్నారు. బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ జనవరి 10 వరకూ పంటలకు నీరు వదులుతామన్నారు. అలాగే క్రస్ట్ గేట్లు కూడా డిసెంబరు నెల నుంచి కొత్త గేట్లు అమరుస్తామని తెలపడంతో రైతులు శాంతించారు. రైతులు శాంతించి ఆందోళన విరమించారు.



బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



కళకళలాడుతున్న ఆచేపల్లి చెరువు

40 ఏళ్ల తర్వాత జలకళ

- నిండుకుండలా ఆచేపల్లి చెరువు
- హెచ్ఎన్‌వ్యాలీ నీటితో తీరిన కష్టం
- ప్రజల హర్షాతిరేకాలు

బాగేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆచేపల్లి చెరువుకు హెబ్బాళ-నాగవార ఎత్తిపోతల పథకం (హెచ్ఎన్‌వ్యాలి) రెండోదశల్లో సంస్కరించిన నీరు చేరింది. సుమారు 40ఏళ్లుగా క్రీడామైదానంలో ఉన్న చెరువుకు నీరు చేరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం చెరువు నిండి మరవ ప్రవహించింది. తాలూకా హోబళి పరిధిలోని యల్లంపల్లి, మిట్టేమరి గ్రామపంచాయతీలకు అనుబంధంగా 30కుపైగా గ్రామాలలో కొండగుట్టలు, తాండాలు ఉన్నాయి. నాలుగు దశాబ్దాల తర్వాత చెరువుకు నీరు చేరడంతో గ్రామస్తులలో హర్షం నెలకొంది. దశాబ్దాలపాటు కరువు నెలకొనడంతో బోరుబావులలో నీరు 1200 అడుగులు తవ్వినా నీరు దొరకడం గగనంగా ఉండేది. పశుపక్ష్యాదులకు నీటికొరత ఉంది. ఈ తరుణంలో శాశ్వతనీరు కల్పించాలంటూ పోరాటాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా హెచ్ఎన్‌వ్యాలి నీరు అందించాలన్న ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరగా ఎట్టకేలకు సాకారమైంది.

క్రైం కార్నర్

వైద్యుడి మృతదేహం లభ్యం


కార్తీక్‌రెడ్డి మృతదేహం

బెళుగుప్ప, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పంప నూరు వద్ద హంద్రీనీవా కాలువలో ఆదివారం సాయంత్రం గల్లంతైన వైద్యుడు కార్తీక్‌రెడ్డి శవమై తేలారు. ఘటనా స్థలానికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన వెంకటస్వామిరెడ్డి, శ్రీదేవి రైతు దంపతుల పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి. బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేస్తుండేవారు. ఆయన భార్య శ్రావణి కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం హంద్రీనీవా బ్రిడ్జిపై నుంచి ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోతూ.. కాపాడాలంటూ చేతులెత్తి అరిచారు. ఒడ్డున కూర్చుని ఉన్న బంధువుల సమాచారంతో బ్యాటరీలు వేసుకుని పోలీసులు గాలించారు. సోమవారం బ్రిడ్జికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. భార్య శ్రావణి బంధువులు, తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.


కాలువ గట్టున విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

పుట్టిన రోజునే ఆత్మహత్య

- అపార్ట్‌మెంట్ పైనుంచి దూకిన బీటెక్ విద్యార్థి
- అక్కడికక్కడే మృతి

అనంతపురం క్రైం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన బీటెక్ విద్యార్థి చల్లా శ్రవణ్(18) పుట్టిన రోజునే ఆత్మహత్య చేసుకున్నాడు. తాము ఉంటున్న అపార్టుమెంట్‌లోని 5వ అంతస్తు నుంచీ దూకి ప్రాణం తీసుకున్నాడు. దీనిపై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెలుగుప్ప మండలానికి చెందిన లక్ష్మీనరసింహులు కుటుంబం రాంనగర్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటోంది. ఇతడికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన చల్లా శ్రవణ్ బళ్లారిలోని బీఐటీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి ఏడాది చదువుతుండేవాడు. సోమవారం పుట్టినరోజు కావడంతో ఆదివారం ఇంటికి వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక అపార్టుమెంట్ 5వ అంతస్తు నుంచీ దూకాడు. తల, ఇతర భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అవమానభారంతో మహిళ..

బత్తలపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ప్రమీల (45) సోమవారం అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు భార్య ప్రమీల అదే గ్రామానికి చెందిన వడ్డే నెట్టికంటికి ఐదేళ్ల కిందట రూ.20వేలు వడ్డీకి అప్పు ఇచ్చారు. రెండేళ్లుగా నెట్టికంటి వడ్డీ చెల్లించలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం ఉంది. కాగా ప్రమీల తన పొలంలో పని చేయించుకున్నందుకు కూలీలకు ఇవ్వమని తన బంధువైన పెద్దక్కకు ఆదివారం కూలి డబ్బులు ఇచ్చింది. అయితే పెద్దక్క కూలీలకు డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయం తెలుసుకున్న ప్రమీల పెద్దక్కను మందలించింది. ఇది విన్న నెట్టికంటి కోడలు హేమ తమనే తిడుతోందని భావించి తమ బంధువులైన ఆదిలక్ష్మి, సుంకన్నతో కలిసి ప్రమీలతో గొడవపడింది. ఈక్రమంలోనే సుంకన్న ప్రమీలపై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగని హేమ బత్తలపల్లిలో ఉన్న వాళ్ల అమ్మకు ఫోన్ చేసి, మరో ఇద్దరిని పిలిపించి మరోసారి ప్రమీలపై దాడి చేయించింది. దీన్ని అవమానంగా భావించిన ప్రమీల తీవ్రంగా కుంగిపోయింది. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఉరికి వేలాడుతున్న ప్రమీలను ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కలవారి సాయంతో కిందకు దించి చూడగా మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సీఐ రెడ్డప్ప గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ విషయమై కొడుకు సంజీవరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హేమ, ఆదిలక్ష్మి, సుక్కన్న, ఓసురప్ప, రామాంజనమ్మల కేసు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌చార్జు హరీ‌ష్‌బాబు, బీజేపీ నాయకులు వీరనారప్ప గ్రామానికి చేరుకొని ప్రమీల మృతదేహానికి నివాళులర్పించారు.

పెళ్లి కాలేదని యువకుడు..

శెట్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదన్న మనస్తాపంతో మండలంలోని ఐదుకల్లు గ్రామానికి చెందిన కమ్మర నాగరాజు కుమారుడు కమ్మర హనుమంతరాయుడు (26) ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని కరణం రాజశేఖర్ పొలం వద్ద చింతచెట్టుకు చీరతో ఉరేసుకుని, మరణించాడు. అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు గ్రామంలో వెతికినా ప్రయోజనం లేదు. సోమవారం ఉదయం రాజశేఖర్ పొలం వైపు వెళ్లిన గ్రామస్థులు హనుమంతురాయుడు ఉరికి వేలాడుతుండడాన్ని చూసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. అతడి తల్లి తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపుర ంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 46టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

లేపాక్షిలో రుద్రాభిషేకం

లేపాక్షి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, ఘనంగా నిర్వహించారు. వేద పండితులు దుర్గా వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.


ఏడు శిరస్సుల నాగేంద్రుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రమా.. నీవు లేకుండా ఎలా బతికేది..?

- భార్య మృతదేహంపై పడి రోదించిన భర్త
- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు


రమాదేవి (ఫైల్)

గార్లదిన్నె/శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రమా.. అప్పుడే నన్ను వదిలి పోతివా..? నాకు పని చేతకాదు. మన బిడ్డను ఎలా సాకాలి? ఎలా బతకాలి?' అంటూ భార్య మృతదేహంపై పడి దివ్యాంగుడైన భర్త రోదించిన తీరు కంటతడి పెట్టించింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన సోమవారం తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు శింగనమలకు చెందిన దివ్యాంగుడైన చిన్న పోతన్న, రమాదేవి(35) దంపతులు శింగనమలలో కూలి పనులు చేసుకుని జీవించేవారు. గ్రామంలో పనులు లేక పోవడంతో కొన్ని నెలలు కిందట రమాదేవి పుట్టినిల్లు అయిన పామిడికి వలస వెళ్లారు. అయితే వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడం, సదరం సర్టిఫికెట్ పనుల కోసం సోమవారం చిన్నపోతన్న, రమాదేవి తమ కుమారుడు సాంబశివను తీసుకుని తమ బంధువైన చంద్రశేఖర్‌తో కలిసి స్కూటీలో శింగనమలకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పామిడికి స్కూటీలో బయల్దేరారు. తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై వీరి స్కూటీని బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనాల లోడుతో మధ్యప్రదేశ్‌కు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీలో ప్రయాణిస్తున్న రమాదేవి అక్కడికక్కడే మృతి చెందగా చిన్న పోతన్న, కుమారుడు శివ, బంధువు శేఖర్ గాయపడ్డారు. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్య మృతదేహంపై పడి చిన్న పోతన్న కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఎస్ఐ మహహ్మద్‌గౌస్ బాషా, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు.


భార్య మృతదేహంపై పడి ఏడుస్తున్న చిన్న పోతన్న

అంత్యక్రియలకు వెళుతుండగా..

- ఆటో బోల్తా, ఒకరి మృతి, కొందరికి గాయాలు


ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన ఆటోలోని సీటు

ఉరవకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బంధువుల అంత్యక్రియలకు వెళ్తూ, ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పామిడి మండలం, రామగిరి గ్రామానికి చెందిన తిరుపతయ్య(55) వజ్రకరూరు మండలం హోతూరులో తమ సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లేందుకు ఉరవకొండ నుంచి వెళ్తున్న ప్రయాణికుల ఆటో ఎక్కాడు. అయితే చిన్నహోతూరు సమీపంలోని హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న తిరుపతయ్య, మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ, వసుంధర, మాలింగమ్మ, వన్నమ్మలతో పాటు మరికొంత మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి, గుంతకల్లులోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతన్ని గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెం దాడు. తీవ్రంగా గాయపడిన మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ హో తూరు గ్రామానికి చెందిన వారు కాగా, వసుంధర, మాలింగమ్మ, వ న్నమ్మలు కర్ణాటకలో కూలి పనులకు వలస వెళ్లి అంత్యక్రియల్లో పా ల్గొనేందుకు వచ్చి గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నాగస్వామి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు రహదారిలో పాపిరెడ్డిపల్లి వద్ద సోమవారం కారు ఢీకొని శంకర్‌నాయక్ అలియాస్ గోప్యానాయక్ (74) సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ షెక్షావలీ తెలిపారు. బూదిలి ప్రాంతానికి చెందిన శంకర్‌నాయక్ పుట్టపర్తి- బెంగళూరు రహదారిలో వడ్లకళ్లం చేస్తు, సోమవారం తెల్లవారుజామున చలిమంట వేసుకోవడానికి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. గోరంట్ల మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన ఉమాశంకర్ బెంగళూరు నుంచి కారులో వస్తూ రోడ్డు దాటుతున్న శంకర్‌నాయక్‌ను ఢీకొట్టాడు. దీంతో శంకర్‌నాయక్ మృతి చెందాడు. మృతుడి కుమార్తె రేఖాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

- ఇదే రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. చిలమత్తూరు మండలం బీదిరెడ్డిపల్లికి చెందిన తల్లీకుమారుడు లక్ష్మీదేవమ్మ, అమరనాథ్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వెళ్తూ రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్యాంకర్ లారీని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వర్సిటీలోని పరీక్షల విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు తదితరులు ఫలితాలను విడుదల చేశారు. బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఫస్టియర్ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో విద్యార్థులు చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య శివకుమార్, ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, డా. శ్రీధర్, అంకారావు పాల్గొన్నారు.

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు మారుతీప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

గుట్కా స్వాధీనం


సీజ్ చేసిన సరుకుతో అధికారులు

అనంతపురం క్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గుట్కాను అక్రమంగా బ్యాగుల్లో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చే శారు. సోమవారం ఏకంగా రూ.31.20 లక్షల విలువైన పాన్ మ సాలా, గుట్కా స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మే రకు విజిలెన్స్, జీఎస్టీ అధికారులు రుద్రంపేట సమీపంలోని డీమార్ట్ వద్ద 44వ జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. వ్యాన్‌లో కర్ణాటక నుంచి తెలంగాణకు అక్రమంగా 120 గన్నీ బ్యాగుల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. లక్షలాది విలువైన ఈ సరుకును అధికారులు వాణిజ్య పన్నుల అధికారులకు స్వాధీనపరిచారు. తనిఖీల్లో సీఐ జమాల్‌బాషా, అధికారులు రాకేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు నమోదు చేయించండి

- డీడీ కుష్బూకొఠారి

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో చదివే ఎస్సీ ఉపకులాల విద్యార్థులకు ఉపకార వేతనాలకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికి ఫ్రెష్‌గా నమోదు చేయించాలని ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి ప్రిన్సిపాళ్లను సోమవారం ఓప్రకటనలో కోరారు. ఇందు కోసం జ్ఞాన భూమి-వీ.2వెబ్‌పోర్టల్ కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్‌లో దరఖాస్తులు పొందుపరచినట్లు తెలిపారు. ఈ దరఖాస్తు నమోదు ప్రక్రియ సంబంధిత యూనివర్సిటీ అకడమిక్ క్యాలండర్ ఇయర్ ప్రారంభం నుంచి మూడు నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన విద్యార్థులందరి రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

కళ్యాణదుర్గం ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి

- హైకోర్టులో పిల్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గంలో ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అనంతపురం వైసీపీ మాజీ ఎంపీ తలారి రంగయ్య ఈ పిల్ వేశారు. కళ్యాణదుర్గంలో బోయ యర్రప్ప, ఆయన భార్య భార్గవి ఈ-సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అక్కడ నుండి తక్కువ విలువ చేసే ఈ-స్టాంపులను కొనుగోలు చేసి ఎక్కువ విలువగల స్టాంపులుగా మర్చి కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధీనంలోని ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోట్ల రూపాయాల ఆర్థిక లావాదేవీలను నిర్వహించిందన్నారు. కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీలు, లోన్ దస్త్రాల పై లోతైన విచారణ జరిపించాలని కోరారు.

బంగారం చైను లాక్కెళ్లిన దుండగులు

చిలమత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మెరుగు పేరుతో ఓ మహిళ మెడలో బంగారం చైను లాక్కుపోయిన సంఘటన మండలంలోని మరవకొత్తపల్లిలో సోమవారం జరిగింది. బాధితురాలు సుశీలమ్మ తెలిపిన ప్రకారం ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంట్లో ఉన్న పాత వెండి, ఇత్తడి వస్తువులకు మెరుగుపెడతామని చెప్పారన్నారు. దీంతో తాను వారిని ఇంటి వద్దకు పిలిచి ఇంట్లో ఉన్న ఇత్తడి కలశం, ఇతర పూజ సామగ్రి వస్తువులు ఇచ్చినట్లు తెలిపారు. మరికొన్ని వస్తువులను తీసుకురావడానికి ఇంట్లోకి వెళుతుండగా ఆ ఇద్దరి వ్యక్తుల్లో ఒక వ్యక్తి వెంబడించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు చైనును లాగేసుకున్నాడన్నారు. ఇంటి బయట అప్పటికే ద్విచక్రవాహనంలో సిద్ధంగా ఉన్న వ్యక్తి దాన్ని ఎక్కి పారిపోయాడు. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకున్న ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి దుండగుల కోసం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ బాబు తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు పురస్కారాలు

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైలింజన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడగా అప్రమత్తమై అగ్ని ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించి, ప్రశంసా పురస్కారాలను అందజేశారు. గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులోని ఇంజిన్‌లో పైన ఉండే హైటెన్షన్ కంపార్టుమెంట్‌లోని సేఫ్టీ ఎక్విప్‌మెంట్ అయిన కెపాసిటర్ డంపింగ్ ప్యానెల్ వేడెక్కిపోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ శబరినాథన్ గుర్తించారు. లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు తెలపడంతో ఆయన అప్రమత్తమై అగ్ని ప్రమాదం ఏర్పడకుండా రైలును జాగ్రత్తగా నడిపారు. సురక్షితంగా తిరుపతికి చేర్చగా అక్కడ రైలింజన్‌కు మరమ్మతులు చేశారు. రైలింజన్‌లో అగ్ని ప్రమాదం ఏర్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించి, విధి నిర్వహణలో నిబద్ధతను చాటిన కారణంగా ఈ ఇద్దరు ఉద్యోగులను సోమవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి రప్పించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా.. చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ శబరినాథన్‌కు, లోకోపైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.


లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

రేపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ సొమ్ము, కేంద్రంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేయనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి అధికారికంగా సమాచారం అందింది. జిల్లాలోని 2,75,642 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ సొమ్ము రూ.51.10 కోట్లు మొత్తం రూ.188.92 కోట్లు జమ చేయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.132.52 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.46.24 కోట్లు మొత్తం రూ.178.76 కోట్లు విడుదల చేయనున్నారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు చొప్పున జమ చేశాయి. ఈనెల 19వ తేదీన రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనుంది. మిగిలిన సొమ్మును మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనున్నాయి.

అనంతపురం బాలికల జట్టుకు ప్రథమ స్థానం


కబడ్డీ విజేతగా నిలిచిన అనంతపురం బాలికల జట్టు

వినుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండ జూనియర్ కాలేజీ ఆవరణలో జరుగుతున్న కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించారు. నెల్లూరు బాలికల జట్టు ద్వితీయస్థానం సాధించింది. బాలుర విభాగంలో గుంటూరు బాలుర జట్టు కడప బాలుర జట్టుపై విజయం సాధించి గుంటూరు జట్టు ప్రథమస్థానం, కడప జట్టు ద్వితీయ స్థానం సాధించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా దస్తగిరి తదితరులు పాల్గొని ఆటలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి

- లోకో రన్నింగ్ స్టాఫ్ డిమాండ్



ఆందోళన చేస్తున్న లోకో రన్నింగ్ స్టాఫ్

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ లాబీ వద్దకు చేరుకున్న లోకో రన్నింగ్ స్టాఫ్ ఆందోళనకు దిగారు. యూనియన్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ.. రన్నింగ్ అలవెన్స్ పెంచాలనీ, టీఏ తరహాలో కిలోమీటర్ అలవెన్సుకు కూడా ఐటీ మినహాయింపు ఇవ్వాలనీ, రన్నింగ్ స్టాఫ్ ప్రతి ప్రమోషన్‌కు గ్రేడ్ పేను పెంచాలనీ, సైకో టెస్ట్‌లో ఫెయిలైన సిబ్బందికి పే ఎలిమెంట్ ఇవ్వకపోవడాన్ని ఉపసంహరించాలనీ, హెడ్ క్వార్టర్స్ బైపాసింగ్ విధానం వద్దనీ, 72 గంటల పని విధానాన్ని తొలగించాలనీ, డబుల్ కాల్ సిస్టంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టీల నిర్వాహకురాలిపై దాడి

- ఇంటి ముందు ధర్నా


ధర్నా చేస్తున్న బాధితులు

గుంతకల్లుటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిట్టీల డబ్బు ఇవ్వలేదంటూ సోమవారం సాయంత్రం ఓ మహిళ, ఆమె తండ్రి కళ్లలో కారం వేసి విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ధర్మవరం గేట్ రోడ్డులో నివాసముంటున్న దిల్షాద్ బేగం ఫొటో స్టూడియో నడుపుతూ చిట్టీలు నిర్వహిస్తోంది. చిట్టీల డబ్బు ఇవ్వకుండా మోసం చేసి.. తమపైనే కేసులు పెడుతోందంటూ బాధితులు.. పర్వీన్, కౌసర్, షాకీరా, అరుణమ్మ తదితరులు దిల్షాద్ బేగం ఇంటిపై సోమవారం దాడి చేశారు. ఆమెను రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి, కళ్లలో కారం కొట్టి, దాడి చేశారు. ఆమె ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ధర్నా విరమించాలని నచ్చజెప్పారు. చిట్టీల డబ్బు ఇచ్చేవరకు ధర్నా విరమించేది లేదని వారు భీష్మించారు. గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దిల్షాద్‌బేగం, ఆమె తండ్రిని పోలీసులు ఆటోలో స్టేషన్‌కు తరలించారు. బాధితులు కూడా వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కదిరి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సమానత్వం, సమ సమాజం.. సోషలిజం లక్ష్యాలని, దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. 'అక్టోబరు విప్లవం.. విశిష్టత' అనే అంశంపై పట్టణంలో సోమవారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. అంతకు మునుపు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 1947లో సంభవించిన మహత్తర రష్యన్ విప్లవం ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోచుకునే సమాజం సోషలిస్టు వ్యవస్థకు బీజం వేసిందని అన్నారు. పాత సామాజిక విప్లవాలు మానవాళిని ఒక దోపిడీ వ్యవస్థ నుంచి మరో దోపిడీ వ్యవస్థకు నడిపిస్తే.. అక్టోబరు సోషలిస్టు విప్లవం దోపిడీని పూర్తిగా నిర్మూలించిందని అన్నారు. నేడు భారతదేశంలో మోదీ పాలన అసమానతులను పెంచేలా ఉందని విమర్శించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రజలకు అందించడం లేదని, కార్మిక చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూల మార్గాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాంభూపాల్ అన్నారు. అక్టోబరు విప్లవం స్ఫూర్తితో రానున్న కాలంలో అన్ని రంగాలలో అసమానతలను తొలగించే విధంగా పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ప్రవీణ్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, బడా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

తిరుమలై కృష్ణమాచార్య (జయంతి)



ఆధునిక యోగా పితామహగా పేరొందిన తిరుమలై కృష్ణమాచార్య 1888 నవంబరు 18న కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా ముచుకుందపుర ప్రాంతంలో జన్మించారు. యోగాలోనే కాకుండా ఆయుర్వేద వైద్యంలోనూ, విద్వాంసుడిగానూ పేరొందారు. ప్రాణాయామం, ఆసనాలతో కూడిన 'హఠ యోగను పునరుద్ధరించడంలో ఎంతో కృషి చేశారు. యోగాకు సంబంధించి పలు రచనలు చేశారు. యోగ మకరంద, యోగాసనగళు, యోగ రహస్య, యోగవల్లి తదితర రచనలు ప్రముఖమైనవి. మైసూరు మహారాజు నాల్గో ఒడయార్ సహకారంతో దేశమంతా పర్యటించి యోగాను విస్తృతం చేశారు. ఆయన శిష్యులైన టీకేవీ దేశికాచార్, బీకేఎస్ అయ్యంగార్‌లు కూడా ఎంతో పేరొందారు. 1989 ఫిబ్రవరి 28న పరమపదించారు.

ఆవంత్స సోమసుందర్ (జయంతి)



ప్రముఖ అభ్యుదయవాది ఆవంత్స సోమసుందర్ తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సమీపంలోని శంఖవరంలో 1924 నవంబరు 18న జన్మించారు. తెలుగు కవి, విమర్శకుడు, రచయిత. 'వజ్రాయుధం' రచన ఎంతో పేరొందింది. ఆయన తొలి కవిత 'ఇంక్విలాబ్ జిందాబాద్' కూడా ఎంతో గుర్తింపు పొందింది. కథకుడిగా, నవలా రచయితగా నాటకకర్తగా అనువాదకుడిగా భిన్నరూపాలతో ఏడు దశాబ్దాలకుపైగా సాహితీసేవలు అందించి పలు పురస్కారాలు పొందారు. సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, ఎన్టీఆర్ స్మారక జాతీయ పురస్కారం, కళారత్న పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక ట్రస్టు ద్వారా ఏటా కవులను ప్రోత్సహించేవారు. 92వ యేట జన్మదినం సందర్భంగా పిఠాపురంలో ఘనంగా సత్కరించారు. 2016 ఆగస్టు 12న కన్నుమూశారు.

నయనతార (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటి నయనతార 1984 నవంబరు 18న బెంగళూరులో మళయాళీ దంపతులకు జన్మించారు. అసలు పేరు డయానా మారియమ్ కురియన్. తమిళ, తెలుగు, మళయాళ భాషల సినిమాలలో 75 సినిమాలకు పైగా నటించారు. దాదాపు ప్రముఖ హీరోలందరితోనూ నటించగా బాక్సాఫీస్ వద్ద సినిమాలు విజయవంతం అయ్యాయి. 2018లో ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 సెలెబ్రిటీ జాబితాలో దక్షిణాది తొలి మహిళగా స్థానం దక్కించుకున్నారు. 2011లో శ్రీరామరాజ్యంలో 'సీత' పాత్రకు ఉగాది పురస్కారం అందుకున్నారు. 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నంది అవార్డు, ఐఐఎఫ్ఎ, కలైమామణి ఇతర పురస్కారాలు పొందారు.



కవితాళ పోలీస్ స్టేషన్

కవితాళ పోలీస్ స్టేషన్‌కు అవార్డు

- కేంద్ర హోం శాఖ నుంచి ఎస్పీకి లేఖ
- 28న ఢిల్లీలో అవార్డు ప్రదానం

రాయచూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా కవితాళ పోలీస్ స్టేషన్‌కు ఉత్తమ సేవలందిస్తున్న పోలీస్ స్టేషన్‌గా అవార్డు దక్కనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 79 పోలీస్ స్టేషన్‌లను పరిశీలించిన అధికారుల బృందం దేశ వ్యాప్తంగా మూడింటిని ఉత్తమ స్టేషన్‌లుగా ఎంపిక చేసింది. ఫ్రెండ్లీ పోలీస్, ఫ్రెండ్లీ సిబ్బంది, సకాలంలో సేవలు తదితర అంశాలు ప్రామాణికంగా తీసుకున్న కేంద్ర హోం శాఖ అధికారుల బృందం కవితాళ పోలీస్ స్టేషన్‌ను ఉత్తమ స్టేషన్‌గా ఎంపిక చేసింది. ఈ నెల 28న కొత్త ఢిల్లీలో కేంద్ర హోం శాక మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును పోలీస్ స్టేషన్‌కు అందించనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర హోం శాఖ నుంచి జిల్లా ఎస్పీ పుట్టమాదయ్యకు ఆదివారం సాయంత్రం లేఖ అందినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



పరిశుభ్రంగా ఎస్ఐ చాంబర్

సహకార రత్న పురస్కారానికి

విశ్వనాథ్ ఎంపిక

పావగడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సహకార రంగంలో పలు సేవలు అందించిన గాయత్రి కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్ విశ్వనాథ్ సహకార రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. 28ఏళ్లుగా వివిధ రంగాల్లో సేవలందించి ప్రజల మన్ననలు పొందిన విశ్వనాథ్ కర్నాటక రాష్ట్ర వసతి మహామండలి డైరెక్టర్‌గా గతంలో సేవలందించారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే హెచ్ వీ వెంకటేశ్, కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు ఆర్టీ ఖాన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





ఆలంబగిరి గురుమూర్తేశ్వరస్వామి ఆలయంలో రజత కవచధారణ



సోమేశ్వర ఆలయంలో..

శివోహం

ఆలయాల్లో కార్తీక సోమవార పూజలు

చింతామణి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా శివనామస్మరణ మార్మోగిది. శివాలయాల్లో భక్తులు తెల్లవారుజామునుంచే దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. చింతామణి పట్టణంలోని ఎస్ఎన్‌టీ లే అవుట్‌లోని నాగనాథేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు లక్షదీపోత్సవం నిర్వహించారు. తాలూకాలోని కురుబూరు సోమేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం, అలంకరణలు కొనసాగాయి. ప్రసిద్ధి చెందిన ఆలంబగిరి కొండపై వెలసిన గురుమూర్తేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు, అలంకరణ నిర్వహించారు. రజతకవచధారణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇక పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని నరసింహస్వామి ఆలయంలోనూ, కన్నంపల్లి సమీపానగల శనిమహాత్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ శనైశ్చరుడిని వెన్నతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని నగరంలోని సంపంగిరామనగర పుష్కరిణిలో దీపోత్సవం నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి దీపాలు వెలిగించారు. ఖాళీ కోనేరు ప్రాంగణమంతా దీపాలు వెలిగించడంతో ఒక ప్రత్యేకమైన శోభ నెలకొంది. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఇక్కడ దీపోత్సవం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

చీమసంద్రలో బసవేశ్వర రథోత్సవం

మహదేవపుర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. చీమసంద్రలో బసవేశ్వర రథోత్సవంలో స్థానికులు, చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విశేష పూజల్లోనూ, రథోత్సవంలోనూ మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. కాగా జ్యోతిపురలోని జ్యోతిర్లింగేశ్వర ఆలయం, వర్తూరులోని కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర దేవస్థానం, గుంజూరులోని సోమనాథ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక బీజేపీ నాయకులు పిళ్ళప్ప, వేణు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



చింతామణి నరసింహస్వామి ఆలయంలో అలంకరణ

ఓంకారేశ్వరస్వామి ఆలయంలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో పురాణ ప్రసిద్ధమైన 101 లింగాలతో పేరొందిన ఓంకారేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో ఆలయం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

శివనామంతో మార్మోగిన శివాలయం

బొమ్మనహళ్ళి: కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని స్థానిక బేగూరులోని నాగనాథేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాధారణ దర్శనానికి సుమారు 2 గంటలకుపైగా సమయం పట్టింది. ఉదయం 6 గంటలనుంచి క్యూ కొనసాగింది. హరోహర, శంభోశంకర మహదేవ అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో బ్యారికేడ్‌లతో క్యూ ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ సేవాకర్త హొంగసంద్ర శ్రీనివాసరెడ్డి తెలిపారు. సాయంత్రం లక్షదీపోత్సవంతోపాటు భక్తి కచేరి కొనసాగింది. రాత్రి 11 గంటల వరకు భక్తులరద్దీ కొనసాగింది. కార్తీకమాసంలో నాలుగు సోమవారాలకు అంబరీశ్‌రెడ్డి, మధుసూధనరెడ్డి, శ్రీనివాసులు తదితరులు అన్నసంతర్పణకు సహకారం అందించినట్లు తెలిపారు.



జ్యోతిపురలోని జ్యోతిర్లింగేశ్వరుడు



చింతామణి తాలూకా మురగమల్ల కొండపై ముక్తీశ్వరస్వామి



విజయపుర ఓంకారేశ్వరస్వామికి విశేష అలంకరణ



బసవేశ్వర రథోత్సవంలో మాజీ మంత్రి లింబావళి తదితరులు



బేగూరులోని నాగనాథేశ్వర ఆలయం



సంపంగి రామనగర దీపోత్సవం

హెచ్చెల్సీ పక్కనే తవ్వకాలు

బొమ్మనహాళ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) పక్కనే కర్ణాటక పరిధిలో మట్టి తవ్వకాలు చేపడుతుండడం మండల రైతుల్లో ఆందోళన రేపుతోంది. కాలువ అనంత భాగంలో ఉండగా, తవ్వకం మాత్రం అవతల రాష్ట్రంలో చేపడుతున్నారు. యంత్రాలతో కాలువకు కొన్ని అడుగుల దూరంలో తవ్వుతున్నారు. తద్వారా కాలువ బలహీనపడే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అయినా.. హెచ్చెల్సీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటక అధికారులు కాలువ పక్కనే తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే తవ్వకాలను నిలిపివేసి కాలువ పటిష్టతకు చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదం తప్పదని రైతులు అంటున్నారు.



సరిహద్దులో హెచ్చెల్సీ పక్కనే చేపట్టిన తవ్వకాలు

కాలేజీ విస్తరణకు సహకరించండి

- ప్రతిపక్ష నేతకు తెలుగు విజ్ఞాన సమితి వినతి

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వయ్యాలి కావల్‌లోని తెలుగు విజ్ఞాన సమితికి అనుబంధంగా డిగ్రీ కళాశాల, శ్రీకృష్ణదేవరాయ కళామందిరం విస్తరణకు స్థలం కేటాయించే విషయంలో సహకరించాలని ప్రతిపక్షనేత అశోక్‌ను కోరారు. సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షులు ఆది కేశవులు నాయుడు సోమవారం ప్రతిపక్షనేత అశోక్‌ను కలసి సత్కరించారు. ఇదే సందర్భంగా సమితికి అనుబంధంగా ఉండే బెంగళూరు పాలికె స్థలాన్ని కళాశాలకు కేటాయించే విషయంలో సహకరించాలన్నారు.



ప్రతిపక్ష నేత అశోక్‌తో సమితి పదాధికారులు

కేరళ సాహిత్య ఉత్సవంలో భాగస్వాములు కండి

ముఖ్య కార్యనిర్వాహకుడు రవి డీసీ

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేరళ సాహిత్య ఉత్సవంలో భాగస్వామ్యులు కావాలని ముఖ్యకార్యనిర్వాహకుడు రవి డీసీ తెలిపారు. సోమవారం నగరంలో ముందస్తు సమావేశం జరిపారు. కన్నడ సాహిత్య వేత్తలతోపాటు పలువురు పబ్లిషర్స్ భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా రవి డీసీ మాట్లాడుతూ 2026 జనవరి 22 నుంచి నాలుగురోజులపాటు కోజికోడ్ సముద్రతీరంలో ఉత్సవం జరగనుందన్నారు. గతంలో జరిగిన ఉత్సవానికి 6.50లక్షలమంది సందర్శకులు, 600మంది సాహితీవేత్తలు వివిధ రంగాల ప్రముఖులు భాగస్వామ్యులయ్యారన్నారు. సాంస్కృతిక, సాహిత్య, విమర్శలు, కళలు, సంగీతం, సినిమా వంటి అన్ని రంగాలకు సంబంధించిన సమ్మేళనం అన్నారు. ఉత్సవంలో 400మంది సాహితీ ప్రముఖులు, 250 చర్చాగోష్టులు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ 10 సెషన్స్‌లు ఉంటాయని, 15 దేశాలనుంచి ప్రతినిధులు వస్తారన్నారు. పాఠకులు, రచయితలు, కళాకారులతో చర్చాగోష్టులు కొనసాగుతాయన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత బాను ముస్తాక్, అనువాదకురాలు దీపాబాస్తి, నోబెల్ విజేత అబ్దుల్ రజాక్ బూర్నా, ఓల్గా టోకరజెట్, అభిజిత్ బెనర్జీ, ఒలింపియన్ బెన్‌జాన్సన్, ఇంద్రానూయి, అరవింద సుబ్రమణియన్‌తోపాటు పలువురు భాగస్వామ్యులవుతారన్నారు. కేరళ చరిత్రతో సంబంధాలు కలిగిన జర్మనీవాసులు భాగస్వామ్యులవుతారన్నారు.



మీడియా సమావేశంలో నిర్వాహకుడు రవి తదితరులు

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



ప్రశంసాపత్రాలతో చిన్నారులు

బెంగళూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): చిన్నారులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు ఫండ్ ఏ చైల్డ్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆదివారం బసవనగుడి బీఎంఎస్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన పోటీలకు 500మంది చిన్నారులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి పదో తరగతిలోపు విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. బీఎంఎస్ చైర్మన్ ట్రస్టీ దయానంద పై, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్.షా ఆర్యా, బెటర్ వరల్డ్ ప్రతినిధి సుజాతతోపాటు ఫండ్ ఏ చైల్డ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు.

అసత్య కథనాలకు చోటు లేదు

నేషనల్ ప్రెస్ డేలో స్పీకర్ యూటీ ఖాదర్



ప్రెస్ డేలో స్పీకర్ యూటీ ఖాదర్ తదితరులు

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మీడియాలో తప్పుడు కథనాలకు చోటు ఉండరాదని అప్పుటే విశ్వసనీయత సాధ్యమని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ అభిప్రాయపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నేషనల్ ప్రెస్ డేను మీడియా అకాడమీ, ప్రెస్‌క్లబ్ ఆఫ్ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వాస్తవమైన అంశాలు మీడియా ప్రచారం చేయాలన్నారు. సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని వెలుగులోకి తీసుకురావాల్సిన మహత్తరబాధ్యత మీడియాపై ఉందన్నారు. ఇటీవలికాలంలో మీడియా ధోరణిలో మార్పులు వస్తున్నాయని, ఇది దుష్పరిణామాలకు కారణం కావచ్చునన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ అధ్యక్షత వహించగా మీడియా అకాడమీ చైర్మన్ అయేషాఖానం చర్చాగోష్టి ప్రాధాన్యతను వివరించారు. మాజీ ఎడిటర్ నూపురు బసు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ ఆర్ పూర్ణిమా, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ బెళ్ళితట్టె, మీడియా అకాడమీ కార్యదర్శి సహన, వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శివానంద తగడూరు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



ట్రోఫీలతో విజేత జట్టు

ముళబాగిలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతకు జిల్లాస్థాయి సంగొళ్ళి ప్రీమియర్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు సమాజసేవకుడు సంగొళ్ళి వెంకటేశ్ తెలిపారు. పట్టణ శివారులోని క్రికెట్ మైదానం ఆవరణలో రెండురోజుల క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వెంకటేశ్ మాట్లాడుతూ ప్రత్యేకించి క్రికెట్ పోటీలు యువతలో ప్రోత్సాహం, మనోధైర్యం నింపుతాయని అందుకే నిరంతరంగా క్రీడా పోటీల నిర్వహణ అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో అండర్-19 విభాగం పోటీలు ఉంటాయన్నారు. గొడవలకు అవకాశం లేకుండా పోటీలు నిర్వహించడం ఒక సవాల్‌లాంటిదన్నారు. పోటీల్లో పాల్గొనేవారు స్ఫూర్తిదాయకంగా పాల్గొనాలన్నారు. ఇప్పటి వరకు సుమారు 75 పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రథమ బహుమతి సై బాయ్స్ జట్టుకు రూ.30వేలు, ద్వితీయ బహుమతికి రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.7వేలు నగదు, ట్రోఫీలను ప్రదానం చేశారు. తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు సీవీ గోపాల్, యువ ప్రముఖులు నటేశ్, టీచర్ వాసప్ప, సోము, జగన్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.47	1630.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,772	3,357
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,791	7,621
నీటి నిల్వ (టీఎంసీలు)	74.78	97.79

అడవి పంది దాడి.. ఇద్దరికి గాయాలు

రాయచూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని మన్సలాపూర్ గ్రామంలో అడవి పంది దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిలో ఒకరు రామప్పను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం చేర్చారు. ఆదివారం రాత్రి మన్సలాపూర్ గ్రామంలోకి వచ్చిన అడవి పంది మనుషుల పై దాడి చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు దాన్ని తరిమి కొట్టి గ్రామం నుంచి వెళ్లగొట్టారు. రెండు రోజుల క్రితం అడవి పందులు సమీపంలోని పంటపొలాలను నాషనం చేస్తున్న సందర్భంలో రైతులు బాణసంచ పేల్చి వాటిని వెళ్లగొట్టారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఆదివారం రాత్రి ఉరుల్లోకి ప్రవేశించిన అడవి పంది మునుషుల పై దాడికి దిగింది. ప్రస్తుతం పంటపొలాల సీజన్ ముఖ్యంగా పత్తి సీజన్ ముమ్మరంగా ఉన్న నేపథ్యంలో గ్రామస్థులు రైతులు పొలాల్లోకి వెళ్లెందుకు అడవి పంది దెబ్బతో భయపడుతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని పందుల దాడిని నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సత్యసాయి శతజయంతికి తరలిరండి

రొద్దం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు 30ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు రవి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు రొద్దం నుంచి మూడు బస్సులు మండలంలోని అన్ని గ్రామాలకు 30 బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వృద్ధులు, పిల్లలు, దంపతులు, విచ్చేసి పుట్టపర్తిలో స్వామివారి సమాధిని దర్శించుకోవాలన్నారు.

'ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి'

సిరుగుప్ప నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం అత్యావసరమని వైద్యులు ఖాజామోహిద్దీన్ తెలిపారు. సోమవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో ఖాద్రి పబ్లిక్ పాఠశాలలో ఆరోగ్య శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బళ్లారి వైద్యులు రోగులను విద్యార్థులను పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరు నెలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు.

జీవనశైలితోనే మధుమేహం ముప్పు: డీహెచ్ఓ



జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవనశైలితోనే మధుమేహం వ్యాపిస్తుందని, ప్రతి ఒక్కరూ అందులో మార్పులు చేసుకోవాలని, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ (డీహెచ్ఓ) రమేశ్‌బాబు అన్నారు. ప్రపంచ మధుమేహ దినంలో భాగంగా 'మధుమేహం శ్రేయస్సు' నినాదంతో సోమవారం నగరంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా అవగాహన నడక మారథాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డయాబెటీస్ అనేది అంటువ్యాధి కాని వ్యాధి అని, జిల్లాలో 20 శాతం కంటే ఎక్కువ మంది డయాబెటీస్ బాధితులున్నారన్నారు. అందువల్ల 30 ఏళ్ళు పైబడిన వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ ఆరోగ్య పథకాన్ని రూపొందించిందని, దీని కింద ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ప్రజలు తమ రోజువారీ పోషకాహారం తీసుకోవడంపై శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యఅతిథి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ అదుపు చేయలేని వ్యాధి అయిన డయాబెటీస్ చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తోందన్నారు. డయాబెటీస్ వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే అది రాక ముందే నియంత్రించుకోవడం మంచిదన్నారు. జిల్లాసర్జన్ బసారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఐదుగురిలో ఒకరికి మధుమేహం ఉందని, మన దైనందిన జీవితంలో మధుమేహం గురించి అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమన్నారు. డయాబెటీస్ శరీరరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేస్తోందన్నారు. వ్యాయామం చేయడం ఆహారంలో చురుకుగా పాల్గొనడం ద్వారా డయాబెటీస్‌కు దూరంగా ఉండవచ్చన్నారు.మార్చ్ జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయానికి చేరుకుంది. ఈసందర్భంగా డాక్టర్ వీరంద్రకుమార్, ఇన్‌చార్జ్ జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఖుర్షీద్ బేగం, బళ్లారి తాలూకా ఆరోగ్య వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యంపై యువతకు అవగాహన తప్పనిసరి

● మహా సంస్థాన్ అధిపతి సిద్దరామానంద మహాస్వామి



ఊరేగింపులో ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం, రామానందస్వాములు

కంప్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : సాహిత్య రచనలను యువతరం అధ్యయనం చేయాలని కాగినాళలోని కనక గురుపీఠ్ మహాసంస్థాన్ అధిపతి సిద్దరామానంద మహాస్వామి అన్నారు. తాలుకా సమీపంలోని కుడితిని పట్టణంలో సోమవారం భక్త కనకదాసు జయంతి, పురాణం 6వ సంవత్సరం సందర్భంగా కనకదాస యువక సంఘం ఏర్పాటు చేసిన ధర్మసభలో ఆయన పాల్గొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు చెడు కోసం సమయాన్ని వృథా చేయడం మానేసి ఆ మంచితనానికి మతపరమైన పనులకు ఉపయోగించాలన్నారు. ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం మాట్లాడుతూ కనకదాసు దేశానికి అపారమైన కృషి చేశారన్నారు. ఆయన ఆదర్శాలు అందరూ పాటించాలన్నారు. రిటైర్డ్ కోరి బసప్ప, కేఎం తాయప్ప, హెచ్ ఆనంద, భీమప్ప, బసవరాజు, ఉచ్చప్పను సన్మానించగా ఎస్ఎస్ఎల్‌సీ, ఎంసీబీఎఫ్‌లో కేబీ పుష్ప, పీయూసీకి చెందిన సహన బన్నట్టి, ఎంసీ పల్లవిని ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. కన్నయ్య మహారాజ్ పురాణ ప్రవచనం చేశారు. ఆయన వెంట గాయకుడు అశోక్ సురాపుర, తబలా వాద్యకారుడు అన్నప్ప ఉన్నారు. ఈ సందర్భంగా గోవర్ధనానందపురి మహాస్వామి, కనకదాస యువక సంఘం అధ్యక్షుడు కందారి గాదిలింగప్ప నాయకులు టీకే కామేష్, కోరి బసప్ప, ఆనంద్, భీమప్ప, ఆనంద్, కేఎం హాలప్ప, కుమారస్వామి, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరస్వాముల జాతర మహోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిద్ధలింగ మహా స్వాములు

సిరుగుప్ప నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈశ్వరస్వాముల జాతర మహోత్సవానికి హోళబళ్లారి సిద్ధలింగ మహాస్వాములు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సిరుగుప్ప, సింధనూరు తాలుకాల మధ్య వెలసిన ఈశ్వరస్వాముల జాతర మహోత్సవాన్ని ఘనంగా జరగాలని స్వాములు ఆకాంక్షించారు. భక్తులు జాతర సందర్భంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. భక్తితో భగవంతున్ని ప్రార్థించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అల్వి అభినవ మహాస్వాములు, బసవరాజు స్వాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతబాయి కత్తిమణి తదితరులు

22 నుంచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

బళ్లారి సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని వెటరన్స్ అథ్లెటిక్ అసోసియేషన్, కర్ణాటకలోని వెటరన్స్ అథ్లెటిక్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా స్టేడియంలో రెండు రోజుల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు క్రీడా సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు శాంతబాయి కత్తిమణి తెలిపారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 30నుంచి 100సంవత్సరాల వయస్సుగల అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 100మీటర్ల నుంచి 5000 మీటర్లు, త్రోయింగ్, జంపింగ్ పోటీలు, ఐదు విభాగాల్లో జరుగుతాయన్నారు. కొన్ని ఆటలు పోటీదారులకు నిషేధించబడ్డాయి. పోటీల్లో దివ్యాంగులు కూడా పాల్గొనవచ్చన్నారు. ఈపోటిలో మొదటి, రెండవ, మూడవ బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. గెలుపొందిన వారు డిసెంబరు 13,14 తేదీల్లో తమిళనాడులోని తిరువణ్ణామలైలో జరిగే దక్షిణ భారత క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో 60నుంచి 70 మంది న్యాయనిర్ణేతలు పాల్గొని విజయవంతం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే క్రీడాకారులకు రాష్ట్ర, జిల్లా విభాగాలు వసతి, ఆహార సౌకర్యాలను కల్పిస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాదికారి డీఎస్ దొడ్డయ్య, ప్రధానకార్యదర్శి నాగభూషణ్, విజయ్, అబ్దుల్ మునాఫ్ తదితరులున్నారు.

హంపిలో బాంబు స్క్వాడ్ తనిఖీలు

కంప్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రసిద్ధి చెందిన హంపి పుణ్యక్షేత్రంలో సోమవారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన కారుబాంబు సంఘటనను దృష్టిలో వుంచుకుని హంపి విరుపాక్షేశ్వరాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. విరూపాక్షేశ్వరుడి ఆలయం, రాతిరథం తదితర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీ చేపట్టారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే సమాచాంర అందజేయాలని పోలీసులు సూచించారు.



నిరుపేదల అభివృద్ధికి శ్రమించిన సిద్దప్ప



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల అభివృద్ధికి టెక్కలకోట సిద్దప్ప ఎంతో శ్రమించారని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అన్నారు. మంగళవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో దివంగతులు సిద్దప్ప 55వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ సిద్దప్ప నగర సభ అధ్యక్షులుగా, పట్టణ పంచాయతీ అధ్యక్షులుగా ఉన్న సమయంలో 3500 మంది ప్రజలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసి పట్టాలు అందజేశారని తెలిపారు. దేవరాజ అరసు స్ఫూర్తితో ఆయన పోరాటం కొనసాగించారని తెలిపారు. ఆయన తత్వ సిద్దాంతాలను పాటిస్తే తాలుకా ఎల్లవేళలా అభివృద్ధి చెందుతుందనిఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, బీజేపీ జిల్లా యువ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, యువ నాయకుడు మారెప్ప, సీనియర్ నాయకులు తిమ్మప్ప, సిద్దప్ప, పురుషోత్తమగౌడ, ఎంఎస్ అంబన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు జోన్



బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

ఉత్సాహంగా తమిళిసై ఉత్సవం

హోసూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ కళలు, సంస్కృతిశాఖ సేలం జోన్ ఆధ్వర్యంలో తమిళిసై ఉత్సవం 2025 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. తమిళిసై త్రయం ముత్తుతాండవర్ అభివృద్ధి చేసిన తమిళసంగీతం. మారిముత్తుపిళ్ళై, అరుణాచల కవీరాయర్ కీర్తనలు, సంగీతం కూర్పుల కారణంగా తమిళిసై ప్రసిద్ధి చెందింది. హోసూరు తళి రోడ్డులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉత్సవాన్ని సబ్ కలెక్టర్ అకృతిసేథి ప్రారంభించారు. కృష్ణగిరి జిల్లా ప్రభుత్వ సంగీత పాఠశాల విద్యార్థుల శుభ సంగీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు సభికులను అలరించాయి. ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వసంతి త్యాగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

హోసూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హోసూరు సబ్‌స్టేషన్‌లో అత్యవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్‌కోత ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ప్రకటించారు. టీవీఎస్ నగర్, అందివాడి, మాదగిరి, టైటాన్ టౌన్‌షిప్, కడిపాళ్యం, కుత్తిరపాళ్యం, పాత మాధగిరి, వీరయనల్లూరు, శివకుమార్‌నగర్, కొత్తూరు, కొత్తకండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వర్‌నగర్, బస్టాండ్ పాంతాల్లో విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

పాలనాధికారుల సంఘం ప్రత్యేక సమావేశం



సంఘం జెండా ఆవిష్కరిస్తున్న సభ్యులు

హోసూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హోసూరు తాలూకా కార్యాలయంలో తమిళనాడు గ్రామపరిపాలనా అధికారుల సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంఘం శిలాఫలకాన్ని ఆవిష్కరించి జెండా ఎగురవేసి గౌరవం తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణన్ అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధ్యక్షుడు నటరాజ్ స్వాగతం పలికారు. తాలూకా అధికారి గుణశివ మాట్లాడుతూ సంఘం కార్యాచరణ గురించి వివరించారు. సంఘం బలోపేతానికి పదాధికారులంతా కృషి చేయాలన్నారు. సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ధార్మిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

● సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్

రాయచూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలాధారులకు అన్నదానం, దీక్ష ఏర్పాటు చేసిన సేవా సమితి నిర్ణయం ప్రశంసనీయమని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ అన్నారు. నగరంలోని ఉదయ నగర్ కాలనీలోగల అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద సోమవారం అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో మాలాధారుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 50 రోజుల పాటు ఈ నిత్యనందన కార్యక్రమం నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వార సమాజంలో శాంతి సుస్థిరతలు వెల్లువెరిస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పరాజు హవాల్దార్ మాట్లాడుతూ జనవరి 14వ తేదీ వరకు సాగే అన్నదాన కార్యక్రమానికి అందరూ సహకరించాలని సూచించారు.

సహకార సంఘాలతోనే గ్రామీణాభివృద్ధి

● బీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, ఎంపీ లతా మల్లికార్జున ● సహకార సమాఖ్య ఉత్సవ్ ప్రారంభం



మాట్లాడుతున్న లతా మల్లికార్జున



బ్యాంక్ అధ్యక్షుడు మల్లికార్జున

హోస్పేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, లక్షలాది కుటుంబాలకు స్వావలంబన కలిగిన జీవితాన్ని నిర్మించడంలో సహకార సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయని బీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, హరపనహళ్లి ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున అన్నారు. సోమవారం హోస్పేట్ లోని సురభి కళ్యాణ మంటపంలో రాష్ట్ర సహకార మండలి, అపెక్స్ బ్యాంక్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ హోస్పేట్ తోపాటు రాయచూర్, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల హాలుబిడ్డ ఉత్పత్తిదారుల సహకార సంఘాల సమాఖ్య, జిల్లా సహకార మూనియన్ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 72వ అఖిల భారత సహకార సప్తాహ కార్యక్రమాన్ని అమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర అపారమైనది, మహిళలు ఇప్పటికే అనేక రంగాలలో ఆర్థికంగా ముందంజలో ఉన్నారు. సహకార సంస్థల భాగస్వామ్యంతో మరింత శక్తివంతమవ్వచ్చన్నారు. ఈ సారి సహకార సప్తాహ థీమ్ ఆత్మనిర్భర్ భారత్ సాధనలో సహకార సంఘాల భూమిక అని నిర్ణయించడం చాలా సముచితం అని అన్నారు. కృషి, పాలు, వసతి, పారిశ్రామిక, బ్యాంకింగ్, సేవలు రంగాల్లో సహకార సంస్థలు వేగంగా ఎదుగుతున్నాయని ఆమె తెలిపారు. పారదర్శకత, నిబద్ధతతో పని చేస్తున్న సహకార సంస్థలను ప్రశంసిస్తూ పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రోత్సాహం వల్లే నేటి సహకార రంగం బలపడింది అని అభిప్రాయడ్డారు.

మహిళా రుణాలకు రూ. 100 కోట్లు

: బ్యాంక్ అధ్యక్షుడు తిప్పేస్వామి

బీడీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు తిప్పేస్వామి మాట్లాడుతూ 5 తాలుకలో మహిళల ఆర్థిక శక్తివంతం కోసం రూ. 100 కోట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. సంస్థలను పూర్తిగా డిజిటల్ వైపు తీసుకెళ్లాలి, సమగ్ర అభివృద్ధికి మహిళల పురోగతి అత్యంత కీలకం అందుకే మహిళలు సహకార సంస్థల్లో పెద్ద ఎత్తున చేరాలి అన్నారు. నమ్మకం, విశ్వాసం మీదా ఈ వ్యవస్థ నడుస్తుంది. సహకార ఉద్యోగులు ప్రజలతో మరింత మర్యాదగా, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సహకార పత్రిక సంచికను ఆవిష్కరించారు. సహకార రంగంలో విశేష కృషి చేసిన పలువురికి సహకార రత్న పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీడీసీసీ మాజీ అధ్యక్షుడు టీ.ఎం చంద్రశేఖరయ్య, చొక్క బసవణగౌడ్రు, డైరెక్టర్లు హంళగప్ప, విశ్వనాథ్, ముకయ్యస్వామి, అర్కొ బసవరాజ్, అపెక్స్ బ్యాంక్ సీఏ దేవరాజ్, సమాఖ్య ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నక్కంటి, ఉపాధ్యక్షుడు ఐ.దారు కేశ్, సూగనగౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





అలంకరణలో ముక్తినాథేశ్వరుడు, హంపిలో జ్యోతులు వెలిగిస్తున్న భక్తులు

కంప్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం చివరి సోమవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం నారాయణస్వామి క్యాంపులో కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో కోదండ రామ ఆలయం ప్రాంగణంలో సతీష్, రామానుజుల ఆధ్వర్యంలో మహిళలు కోలాటాలతో ఆకట్టుకున్నారు. అలాగే కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ముక్తినాథేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పాభిషేకం, గంగపూజ, అమృతాభిషేకం తదితర పూజలు జరిపారు. అలాగే హంపిలో కూడా భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగిస్తూ హంపి విరుపాక్షేశ్వర పార్వతికి మొక్కులు సమర్పించుకున్నారు.

అభయ వరదాంజనేయస్వామి ఆలయంలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరనగర్‌లో వెలసిన అభయ వరదాంజనేయస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.



అభయాంజనేయస్వామి

టెక్ సమ్మిట్‌లో ఏఐ ఆధారిత కియో పీసీ

(5వపేజీ తరువాయి) సిద్ధం చేశారు. ఆన్ డివైజ్ ఏఐకోర్‌కు అనుసంధానంగా ఉంది. ఇది ఇంటర్నెట్ లభ్యం లేకున్నా స్థానికంగా పనిచేసేందుకు ఏఐ అనుకూలం చేయనుంది. కర్ణాటక డీఎస్ఈఆర్‌టీ పాఠ్యాంశాలలో నైపుణ్యత పొంది ఏఐ ఏజెంట్ బుద్ధతో కలిసిరానుందన్నారు. బెంగళూరు టెక్ సమ్మిట్‌ను మంగళవారం సీఎం సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభిస్తారని, ఇదే సందర్భంగా కేఈఓ కంప్యూటర్‌ను సాంకేతికంగా ఆవిష్కరిస్తారన్నారు. సమ్మిట్‌లో ప్రజలు తెలుసుకునేలా ప్రదర్శిస్తామన్నారు. విద్యార్థులు, స్టార్టప్‌లు, పారిశ్రామిక నిపుణులు, ఎగ్జిబిటర్స్ ఉపయోగించుకునేందుకు వీలుగా అందుబాటులోకి తెస్తామన్నారు. కేఈఓ ద్వారా డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే మా ఆశయమన్నారు. కియో పీసీ చిప్ స్టార్టప్ కంపెనీ అని మిగిలిన టెక్నాలజీ, హార్డ్‌వేర్‌లను కియో నెక్స్ అభివృద్ధి చేసిందన్నారు. ఐఐఐటీ ధారవాడ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో కంప్యూటర్‌ను పరిశీలన చేశామన్నారు. ఏడాది కాలంగా కియో పీసీని అభివృద్ధి చేశామన్నారు. అవసరమైన అప్‌డేట్‌లను చేశామన్నారు. ఇప్పటికే పలు కంపెనీలనుంచి 500 కియో పీసీలకు ఆర్డర్‌లు వచ్చాయన్నారు. భవిష్యత్తులో డిమాండ్‌నుబట్టి రూపొందిస్తామన్నారు. ఆవిష్కరించిన తర్వాత కియో నెక్స్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ప్రిబుకింగ్ అవకాశం ఉంటుందన్నారు. రిజర్వు చేసుకున్నవారికి రెండు నెలల్లో సమకూరుస్తామన్నారు. కియోనెక్స్ ద్వారా ఎలక్ట్రానిక్స్ విప్లవం తీసుకురావడమే లక్ష్యమన్నారు. సెమి కండక్టర్ కంపెనీ, సెమి కండక్టర్ చిప్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నామని కంపెనీల పేర్లను త్వరలోనే బహిరంగం చేస్తామన్నారు. తక్కువ సొమ్ముతో ఎక్కువమంది కంప్యూటర్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నదే ప్రధాన ఆశయమన్నారు.

బ్యాంకు ముందు నిరసన



బ్యాంకు ముందు నిరసనలో ఏఐకేకేఎంఎస్ సభ్యులు

బళ్లారి సిటీ,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీధరగడ్డ గ్రామం కర్ణాటక గ్రామీణ శాఖలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం బ్యాంకు ఆవరణలో వారు ఆందోళన చేపట్టారు. ఈ పోరాటినికి సహకరించిన ఎస్‌యూసీఐ పార్టీ గ్రామీణ స్థానిక కమిటి కార్యదర్శి దేవ దాస్ మాట్లాడుతూ కర్ణాటక గ్రామీణ బ్యాంకు ఒకప్పుడు మంచి సేవలను అందించేదని, ఇటీవల శ్రీధర్‌గడ్డ గ్రామంలోని శాఖ పలు సమస్యలకు నిలయంగా మారిందన్నారు. పెన్షన్ తీసుకోవడానికి వచ్చే వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నిరక్ష్యరాసులు, బంగారు రుణాలు కావల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షనమే బ్యాంకు అధికారులు అన్ని సమస్యలు పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు హనుమంతప్ప, జిల్లాకార్యదర్శి గురల్లిరాజా, సంఘం జిల్లా అధ్యక్షులు గోవింద్, రైతులు, ఆశా కార్యకర్తలు బేగం, నిజాం,వీరేశప్ప, ముక్కన్న, అనేక మంది రైతులు పాల్గొన్నారు.